సాక్షి సిద్దిపేట

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



డెంగీ.. డేంజర్ బెల్స్

జిల్లాలో డెంగీ జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించడమే ఇందుకు ప్రధాన కారణం. వివరాలు 8లో ▸



విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

మండల కార్యాలయాల్లో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ రమేశ్ సూచించారు. వివరాలు 8లో ▸



ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. వివరాలు 9లో ▸



సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 27-09-2023

సమయం: బుధవారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు

అంశం: సిద్దిపేట పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమలు, వ్యాధుల తీవ్రత

ఫోన్ నంబర్లు:

9866553321, 9866898692

● ముస్త్యాల.. మురిసిన 'స్వచ్ఛత'

స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా చేర్యాల మండలం ముస్త్యాలలో సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛతా ర్యాలీ, శ్రమదానం, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమేకాక ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, ఎంపీడీఓ సయ్యద్ తారిక్ అన్వర్, ఎంపీఈఓ మహబూబ్ అలీ, ఏపీఓ మంజుల, సీడీపీఓ శారద, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. - చేర్యాల(సిద్దిపేట)



మానవహారంగా ఏర్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రీడల్లోనూ సత్తా చాటండి

- ఆటలతో మానసికోల్లాసం
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ
- ఉమ్మడి జిల్లా క్రీడాపోటీలు ప్రారంభం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియంలో మైనార్టీ గురుకుల పాఠశాలల సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బాలికల విభాగంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సూచించారు. క్రీడా పోటీల్లో ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, మెదక్, సంగారెడ్డి, నారాయణఖేడ్, కోహీర్, పటాన్‌చెరు, అల్గోల్, ఆందోల్‌లలోని మైనార్టీ బాలికల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, హ్యాండ్‌బాల్, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ షేక్ అహ్మద్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, ఎంపీపీ అమరావతి, కౌన్సిలర్ రజిత, మైనార్టీ బాలుర, బాలికల పాఠశాలల ప్రిన్సిపాళ్లు కిరణ్‌కుమార్, సుధారాణి, విజిలెన్స్ అధికారి గౌస్‌తో పాటు సిబ్బంది, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గిరిజన నేత



మంత్రి కేటీఆర్‌ను కలిసి నిధుల విషయమై విన్నవిస్తున్న తిరుపతినాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అక్కన్నపేట మండలం తాళ్లతండాకు చెందిన గుగులోతు తిరుపతినాయక్ కలిశారు. ఈ సందర్భంగా తిరుపతినాయక్ మాట్లాడుతూ అక్కన్నపేట మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా సమీకృత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుకు విన్నవించినట్లు చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో నిధుల మంజూరుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు తిరుపతి నాయక్ పేర్కొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాల్సిందే



కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన బీఎస్పీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటరూరల్: అవినీతిమయమైన టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈఆర్ మోహన్ మాట్లాడుతూ బోర్డు నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. అర్ధరాత్రి నుంచే బీఎస్పీ నాయకులను ముందస్తు అరెస్టులు చేసినప్పటికీ, మిగతా నాయకులు విరోచితంగా పోరాడి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేశారన్నారు. బోర్డును రద్దు చేసేవరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్, జిల్లా కార్యదర్శులు కొండనోళ్ల నరేశ్, వినోద్ చారి, సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్, దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షుడు సంజీవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలు తీర్చండి



ఎమ్మెల్సీ పల్లాకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మద్దూరు మండలం నుంచి చేర్యాల మండలంలో కలిపిన అర్జునపట్ల, కమలాయపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాల ప్రజలు నేటికీ పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ, మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలకు మద్దూరుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనిపై స్పందించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. పల్లాను కలిసిన వారిలో కమలాయపల్లి సర్పంచ్ ఓరుగంటి అంజయ్య, మాజీ మల్లన్న ఆలయ డైరెక్టర్ వజ్రోజు శంకరాచారి, తదితరులు ఉన్నారు.

రేషన్.. కేవైసీతో పరేషాన్

- ఆధార్ కేంద్రాలకు లబ్ధిదారుల పరుగులు
- అప్‌డేట్ కోసం తప్పనితిప్పలు
- ఈ నెలాఖరుకు గడువు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కార్డులో పేర్లు ఉన్న లబ్ధిదారులకే బియ్యం అందేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రేషన్ కార్డుల వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. కుటుంబ యజమానితో పాటు కార్డులో పేర్లు ఉన్న ప్రతి లబ్ధిదారు తమ పరిధిలోని రేషన్ దుకాణానికి వెళ్లి 'ఈ పాస్ యంత్రం' ద్వారా తమ కేవైసీని అప్‌డేట్ చేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. హుస్నాబాద్‌లో ఆధార్ నమోదు కేంద్రాలు అరకొరగా ఉండటంతో తిప్పలు తప్పడంలేదు. – హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో ఆరు ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. కోహెడ, అక్కన్నపేట మండలాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడంతో అక్కడి జనం హుస్నాబాద్‌కు వస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద జనం బారులు తీరుతున్నారు. రేషన్ దుకాణాల్లో సరుకులు పొందాలంటే తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని నిబంధన పెట్టారు. కేవైసీ చేసుకోవాలంటే రేషన్ కార్డుల్లో ఎంత మంది కుటుంబ సభ్యుల పేర్లు ఉంటాయో వారందరి వేలి ముద్రలు తప్పని సరి. రేషన్ దుకాణాల్లో ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు ఉన్న వారి వేలి ముద్రలు సైతం పడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లో వేలిముద్రలు పడాలంటే ఆధార్ అప్‌డేట్ చేసుకుంటేనే సాధ్యపడుతున్నది. మరో వైపు రేషన్ డీలర్లు ఈ నెల చివరి వరకు కేవైసీ పూర్తి చేసుకోవాలని గడువు విధించారు. దీంతో రేషన్ కార్డుదారులు తమ పిల్లలతో కలిసి ఆధార్ లింక్, మొబైల్ లింక్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.



హుస్నాబాద్ పట్టణంలోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద జనం

నమోదుకేంద్రాల సంఖ్య పెంచాలి



రేషన్ దుకాణాల్లో కేవైసీ చేయాలని అడుగుతున్నారు. మా పిల్లల వేలి ముద్రలు పడకపోవడంతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని చెబుతున్నారు. ఆధార్ లింక్, మొబైల్ లింక్ కోసం మా పిల్లలతో కలిసి ఆధార్ కేంద్రానికి వచ్చాం. ఉదయం వస్తే మధ్యాహ్నం వరకు కూడా ఆధార్ అప్‌డేట్ కాలేదు. మరి కొన్ని ఆధార్ నమోదు కేంద్రాలు పెంచాలి. – రవి, మల్లారం

ఆధార్ కేంద్రాలు ఆరే..

హుస్నాబాద్ పట్టణంలో టెలికం ఎక్స్ఛేంజ్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పోస్టాఫీస్, రెండు మీ సేవా కేంద్రాల్లో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రాలకు అనుమతి ఇచ్చారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటే ఒకరికి రూ.150 వసూలు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో జనాన్ని బట్టి రేట్లు పెంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు బ్యాంక్‌ల్లో లావాదేవీలకు సమయం సరిపోవడం లేదని ఏదో నామమాత్రంగా ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో టెలికాం ఎక్స్ఛేంజ్‌కు జనం తరలి వస్తుండటంతో ఇక్కడి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఒకరిది అప్‌డేట్ కావాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల నుంచి జనం వస్తుండటంతో ఆధార్ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. రేషన్ దుకాణాల్లో కేవైసీ గడువు దగ్గరపడుతుండటంతో జనం ఆధార్ నమోదు కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. రేషన్ దుకాణాల్లో కేవైసీ గడువును, అలాగే ఆధార్ నమోద్రాల సంఖ్యను పెంచాలని జనం కోరుతున్నారు.



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

మూడు కుటుంబాల్లో విషాదం

చెరువులో మునిగి ముగ్గురు మహిళల మృతి, బాలుడి గల్లంతు

- బాలుడి కోసం గజఈతగాళ్లతో గాలింపు



చెరువులో గాలిస్తున్న గజఈతగాళ్లు



లావణ్య (ఫైల్)



బాలమణి (ఫైల్)



లక్ష్మి (ఫైల్)



చరణ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటూ బట్టలు ఉతుకుతున్న వారి పాలిట చెరువు యమకూపంగా మారింది. ముగ్గురు మహిళలు మృత్యువాత పడగా, బాలుడు గల్లంతయ్యాడు. మరో మహిళ ప్రాణాలతో బయటపడింది. ఈ విషాదకర ఘటన మనోహరాబాద్ మండలం రంగాయపల్లి చెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాయపల్లికి చెందిన ఫిరంగి చంద్రయ్య, లక్ష్మికి కూతురు లావణ్య (23), ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన బోనాల పండుగకు లక్ష్మి తన సోదరులు కుటుంబాలను ఆహ్వానించింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట్‌కు చెందిన దుడ్డు యాదగిరి, శ్రీకాంత్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్క లక్ష్మి ఆహ్వానంతో యాదగిరి భార్య బాలమణి (30), శ్రీకాంత్ భార్య లక్ష్మి(25), పిల్లలతో కలసి పండుగకు వచ్చారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి..

సోమవారం మధ్యాహ్నం బట్టలు ఉతికేందుకు ఫిరంగి లక్ష్మి, తన కూతురు లావణ్య(23), మరదళ్లు బాలమణి, లక్ష్మిని తీసుకొని చెరువు వద్దకు వెళ్లింది. వీరి వెంట బాలమణి, యాదగిరి కుమారుడు చరణ్(10) కూడా వచ్చాడు. ఈ క్రమంలో చరణ్ ఆడుకుంటూ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తల్లి బాలమణి కాపాడేందుకు ప్రయత్నించి అదుపుతప్పి నీటిలో మునిగిపోయింది. ఆమెను కాపాడేందుకు లావణ్య, లక్ష్మి ఒకరివెంట ఒకరు వెళ్లి నీటమునిగారు. పక్కనే ఉన్న ఫిరంగి లక్ష్మి కాపాడండి అంటూ కేకలు వేస్తూ.. నీళ్లలోకి దిగింది. ఈ క్రమంలో లక్ష్మి కూడా నీటమునిగింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ యువకుడు స్పందించి నీటిలో మునిగిపోతున్న లక్ష్మిని బయటకు లాగి నీటిని కక్కించడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని బాలమణి, లక్ష్మి, లావణ్యల మృతదేహాలను బయటకు తీశారు. తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు, చరణ్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

బాధితులకు వంటేరు పరామర్శ

చెరువులోని జేసీబీ గుంతలే నలుగురి మృతికి కారణమయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. తమ వాళ్లు లేరన్న విషయం జీర్ణించుకోలేక గుండెలు బాదుకుంటూ... దేవుడా ఎంత పని చేస్తివి.. మా వాళ్ళను తీసికెళ్లిపోతివా.. అంటూ కన్నీ రు పెట్టడం అక్కడున్న ప్రతీ ఒక్కరిని కదిలించింది. ఘటనతో మూడు కుంటుంబాల్లో విషాదం అలుముకుంది. పండుగ కోసం ఆడబిడ్డ ఇంటికి వెళ్లి మృత్యువాత పడడంతో అంబర్‌పేట్ గ్రామస్తులు రంగాయపల్లి చెరువు వద్దకు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి చక్కని వేదిక అన్నారు. ప్రతి అర్జీదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా కలిపి మొత్తం 73 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్‌లో ఇద్దరికి చోటు



శ్రీనివాస్



నర్సయ్య

సిద్దిపేటజోన్: రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. హైదరాబాదులో సోమవారం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బండారుపల్లి శ్రీనివాసులు, కోశాధికారిగా జంగపల్లి వెంకటనర్సయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు సాయిరాం, క్రీడా సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



తుది ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వికాస్‌రాజ్ సూచించారు. - సిద్దిపేట రూరల్

రేవంత్‌పై చర్యలేవీ?

- ఓటుకు నోటు కేసులో సీఎం సమాధానం చెప్పాలి: రఘునందన్‌రావు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని వ్యాఖ్య

దుబ్బాకటౌన్: ఓటుకు నోటుకేసులో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటుకు నోటుకేసులో దొరికింది రేవంత్‌రెడ్డి అని సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పింది నిజంకాదా... మరి ఎందుకు అతడిపై చర్య తీసుకోకుండా ప్రభుత్వం లైట్ తీసుకుంటుందో సమధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. త్వరలో కవిత అరెస్టు అవుతుందని రేవంత్‌రెడ్డి ప్రచారం చేయడం చూస్తుంటే.. కవితకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినట్లు ఎవరైనా మీకు చెప్పారా? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఎన్నికల ముందు బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని కాంగ్రెస్ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఎవరెన్ని నాటకాలు ఆడినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

గజ్వేల్ మరో డల్లాస్.. ఏమైంది?

- రెండు చోట్లా కేసీఆర్‌కు ఓటమి తప్పదు
- కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ మండిపాటు

గజ్వేల్: 'గజ్వేల్‌ను మరో డల్లాస్, లండన్, న్యూయార్క్ చేస్తున్నామంటూ ప్రకటనలు గుప్పించారు.. ఇక్కడికి వచ్చి చూస్తే అట్ల ఏమీ కనిపిస్త లేదు.. ఉన్న బస్టాండ్‌ను కూలగొట్టి రేకుల షెడ్డును నిర్మించిండ్రు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంకా పూర్తి చెయ్యలే గిదేనా..? మీరు చేసిన అభివృద్ధి? ఈసారి ఎన్నికల్లో గజ్వేల్‌లోనే కాదు.. కామారెడ్డిలో కూడా కేసీఆర్ ఓడిపోవడం ఖాయం' అని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. సోమవారం కామారెడ్డికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో అర్ధంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల పనులతోపాటు గజ్వేల్ పట్టణంలో బస్టాండ్, రింగు రోడ్డు, మినీ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ గజ్వేల్‌ను బంగారు తునకగా మారుస్తానని చెప్పిన కేసీఆర్ ఆచరణలో విఫలమయ్యారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌ను అభివృద్ధికి నమూనాగా మార్చారని, కామారెడ్డిని సైతం అదే తరహాలో అభివృద్ధి చేసి చూపుతామని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రకటనలు గుప్పిస్తున్న నేపథ్యంలో కామారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇక్కడ పర్యటిస్తున్నానని షబ్బీర్ అలీ చెప్పారు. మంత్రులు చెబుతున్నదానికి ఇక్కడ క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన లేదని విమర్శించారు. వర్గల్‌లో పేదలకు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన 1,200 ఎకరాల భూమిని సైతం ఫుడ్ పార్కు పేరిట లాక్కుంటున్నారని ఆరోపించారు. బూటకపు మాటలు చెబుతున్న కేసీఆర్‌కు గజ్వేల్‌తోపాటు కామారెడ్డిలోనూ ఓటమి తప్పదని హెచ్చరించారు. త్వరలోనే ఇక్కడ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని ప్రకటించారు.



గజ్వేల్‌లో మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ

డిపాజిట్ రాదనే భయంతోనే విమర్శలు: వంటేరు

కామారెడ్డిలో కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో తనకు డిపాజిట్ దక్కదన్న కారణంతోనే షబ్బీర్ అలీ గజ్వేల్‌కు వచ్చి ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ)చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో రూ.10కోట్లతో నిర్మించిన అధునాతన బస్టాండ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన 'కంటి వెలుగు'లో పరీక్షలు చేయించుకొని వస్తే గజ్వేల్ అభివృద్ధిని చూపించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గజ్వేల్‌లో బస్టాండ్లు సక్రమంగా లేవంటూ తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ కృషితో గజ్వేల్.. అభివృద్ధిలో రాష్ట్రానికే మోడల్‌గా మార్చిందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు పుస్తెమెట్టెలు అందజేత



అమ్మవార్లకు వారికి బంగారు అభరణాలు అందిస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయం లోని అమ్మవార్లకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గుణపటి విష్ణురెడ్డిమౌలిక దంపతులు సుమారు 56 గ్రాములు బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఓ అంజయ్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హోటల్ దగ్ధం



హోటల్ వద్ద బాధితులు

నారాయణఖేడ్: పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలోని రోషన్ హోటల్ సోమవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే హోటల్ మూసివేసి ఇంటికి వెళ్లినట్లు యజమాని గౌస్ తెలిపారు. తెల్లవారుజామున హోటల్‌లో మంటలు ఎగిసి పడుతున్నాయని చుట్టుపక్కలవారు సమాచారం ఇచ్చారని చెప్పారు. వచ్చి చూసేసరికి అప్పటికే హోటలోని ఫ్రిజ్, విద్యుత్ మీటర్, స్విచ్‌లు, వైరింగ్, సామగ్రి కాలిపోయాయని తెలిపారు. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

డిమాండ్లు నెరవేర్చండి



అంగన్వాడీ ఉద్యోగుల మానవహారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్లు తక్షణం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీజేఆర్ చౌరస్తాలో అంగన్వాడీలు మానవహారం నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం, తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. సమ్మెకు సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శంకరు, తదితరులు సంఘీభావం తెలిపారు.

గజ్వేల్ పట్టణంలో ధర్నా

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మ డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని మంత్రి సత్యవతి రాథోడ్ తప్పుడు ప్రకటనలు చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

హుస్నాబాద్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో చోటుచేసుకుంది. బొల్లి గణేశ్ (26) అనే యువకుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి కొంత కాలం క్రితమే మృతి చెందాడు. తల్లి కనకమ్మ ఉంది. గణేశ్ ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

డెంగీ.. డేంజర్ బెల్స్..!



అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు
- దోమల స్వైరవిహారం
- పత్తా లేని ఫాగింగ్
- డెంగీ రోగులతో ఆస్పత్రులు కిటకిట

జిల్లాలో డెంగీ జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా దోమల బెడద పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగీ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఈ కేసులు రోజురోజుకూ అధికమవుతున్నాయి.. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

ఓపెన్ ప్లాట్లు.. దోమలకు స్థావరాలు



హనుమాన్ నగర్‌లో స్ప్రే చేస్తున్న మున్సిపల్ కార్మికులు



హుస్నాబాద్ స్నేహనగర్‌లో నిలిచిన మురుగు

హుస్నాబాద్: ఓపెన్ ప్లాట్లలో నీరు నిలిచిపోవడం, పిచ్చిమొక్కలు పెరుగడం, చెత్తను ఆరుబయట పారవేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీనివల్ల దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే ఇండ్ల మధ్య పెద్ద పెద్ద నీటి గుంతలు, ఓపెన్ ప్లాట్లకూడా దోమలకు అడ్డాగా మారాయి. పట్టణంలో 20 వార్డులు ఉన్నాయి. పారిశుద్ధ్య నివారణకు 84 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం, ప్రతివారం డ్రైడే వంటివి నిర్వహిస్తున్నా పారిశుద్ధ్యంలో మార్పు కనబడటం లేదు. మున్సిపల్‌లో ఒక్కటే ఫాగింగ్ మిషన్ ఉంది. డ్రైనేజీ సమస్యను పరిష్కరించి దోమల బారినుంచి తమను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

చేర్యాల(సిద్దిపేట): ఎక్కడికక్కడ మురుగు కాల్వలు చెత్తతో నిండి దోమలకు నిలయాలుగా మారాయి. వర్షాకాలం సీజన్ దోమల తీవ్రత పెరిగి డెంగీ ప్రబలుతున్నా మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతునారు.గత నెలలో ఆరు డెంగ్యూ కేసులు నమోదైనట్లు స్థానిక వైద్యాధికారులు తెలిపారు. ఈ నెల ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క కేసు నమోదు కానప్పటికీ ప్రైవేటు ఆసుపత్రుల్లో కేసుల సంఖ్య అధికంగానే ఉంది. మున్సిపల్ పరిధిలో 12 వార్డుల్లో ఫాగింగ్ చేయడానికి ఒక్క మిషన్ మాత్రమే ఉండగా దాన్ని ఆపరేట్ చేసేందుకు సిబ్బంది లేక వారానికి ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణ లేక పోవడంతో చెత్త పేరుకుపోతోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని తమను డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా కాపాడాని ప్రజలు కోరుతున్నారు.



ప్లాస్టిక్ సీసాలు, చెత్తతో నిండిన మురుగు కాల్వ

దోమలతో నరకయాతన..

దుబ్బాకటౌన్: మున్సిపాల్టీలో చాలా ప్రాంతాల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. దీంతో దోమల బెడద పెరిగి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. దోమలు విజృంభించడంతో ప్రజలు డెంగ్యూ, టైఫాయిడ్‌తో పాటు వివిధ వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో సుమారు 35 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. మురుగునీరు నిలిచిపోవడం, చెత్తాచెదారాలు పేరుకు పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దుబ్బాక మున్సిపాల్టీలో దోమల తీవ్రత ఎక్కువగా ఉందని దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దోమల బెడద తీవ్రం కావడంతో జ్వరాల బారినపడుతూ చాలా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించి ఫాగింగ్, ఆయిల్ బాల్స్, దోమల నివారణ మందులు స్ప్రేలు చేయించాలని కోరుతున్నారు.



ఇళ్ల మధ్య ఉన్న మురుగు కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు



దుబ్బాక బస్టాండ్ వెనకాల కాలువ దుస్థితి

ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

బల్దియా రికార్డుల ప్రకారం 40 వేల నివాస గృహాల్లో 1.5 లక్షల మంది నివసిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఆయా వార్డులు, పట్టణం సరిహద్దుల్లో కొత్తగా వెలిసిన కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ నామమాత్రంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థలేక నివాస గృహాల మధ్య మురుగునీరు నిలిచిపోతోంది. వర్షాలు కూడా కురుస్తుండడంతో మురుగునీటితో కలిసిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వాటిలో దోమల ఆవాసం ఏర్పరుచుకుని ప్రజల అనారోగ్యానికి కారణంగా మారుతున్నాయి. వైరల్ ఫీవర్‌ల ప్రభావం పెరుగుతోంది. ఇప్పటికి 30 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. వైద్య, మున్సిపల్ శాఖలు ముఖ్యంగా కొత్త కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు



దోమల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. రాత్రి సమయంలో ప్రతి వీధిలో ఫాగింగ్ చేయిస్తున్నాం. తడి చెత్త, పొడి చెత్త సేకరణకు త్వరలోనే ప్రతి ఇంటికీ రెండు ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేయిస్తాం.

– రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

పటిష్టమైన చర్యలు..



పారిశుద్ధ్య చర్యలు పటిష్టంగా చేపడుతున్నాం. దోమల నియంత్రణ కోసం మూడు దశల్లో దోమల మీద యుద్ధం చేస్తున్నాం నిలిచిన నీటిని తొలగించేలా ప్రతి శుక్రవారం డ్రైడే... యాంటీ లార్వా ఆపరేషన్, ఫాంగింగ్ ప్రక్రియ చేయిస్తున్నాం. ప్రజలు కూడా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– సంపత్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

చర్యలు తీసుకుంటున్నాం



దుబ్బాక మున్సిపాల్టీలో దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. డ్రైనేజీలు శుభ్రపర్చడమే కాకుండా దోమల నివారణ మందులు చల్లిస్తున్నాం. రోజుకు రెండు వార్డుల చొప్పున ఫాగింగ్ చేయిస్తున్నాం. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని స్వయంగా వెళ్లి ప్రజలను చైతన్య పరుస్తున్నాం.

– గణేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

శభాష్ పోలీసన్న!

- విద్యార్థికి ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ చేయూత
- బుక్స్, నగదు అందజేత



విద్యార్థినికి బుక్స్ అందజేస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్, పక్కన ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమేష్

సిద్దిపేటకమాన్: తండ్రి చనిపోవడం, తల్లి అనారోగ్యం కారణంగా ఓ విద్యార్థి చదువు మానేసి కూరగాయలు అమ్ముతుంది. అమ్మాయి దీన స్థితి తెలుసుకొని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ చలించిపోయాడు. కొంత డబ్బుతో పాటు బుక్స్ కొనుగోలు చేసి ఇచ్చి మానవత్వం చాటుకున్నాడు. ఈ విషయం తెలుసుకుని పలువురు ఆయనను శభాష్ పోలీస్ అని ప్రశంసించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన గుగులోత్ లలిత, లింగులు దంపతులు తమ కూతురు, కుమారుడితో కలిసి కొన్నేళ్ల క్రితం సిద్దిపేటకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. లింగులు కూలీ పనులు చేస్తూ, లలిత కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కూతురు అంజలి మద్దూర్ కేజీవీబిలో 10వ తరగతి, కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా ఈ ఏడాది లింగులు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ బెంగతో భార్య లలిత కూడా అనారోగ్యానికి గురై రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితితో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అంజలి తన స్కూల్ మానేసి అమ్మ చేసిన పని కొంత మేరకు తెలిసి ఉండడంతో హైదరాబాద్ రోడ్డులోని అక్షయ గ్రాండ్ హోటల్ సమీపంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ వచ్చిన డబ్బులతో ఇంట్లోకి సామాగ్రి తీసుకెళ్తుంది. వారం రోజుల క్రితం రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న అమ్మాయిని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ గమనించాడు. అమ్మాయి కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకుని చలించిపోయాడు. దీంతో సోమవారం విద్యార్థిని మంజుల, తన పిన్నిని మోడ్రన్ బస్టాండ్ చౌరస్తా వద్దకు పిలిపించి నగదు సాయంతో పాటు బుక్స్ కొనుగోలు చేసి విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమేష్‌తో కలిసి అందజేశారు. దీంతో విద్యార్థిని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎవరైనా సాయం చేయాలనుకుంటే 9652213177 నెంబర్‌కు ఫోన్‌పే, గుగూల్‌పే చేసి ఆదుకోవాలని కోరారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

జెడ్పీ సీఈఓ రమేశ్



మాట్లాడుతున్న సీఈఓ రమేశ్

హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ మండల పరిషత్ వివాదం త్వరలో ముగిస్తుందని, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెగ్యులర్ కాబోయే పంచాయతీ కార్యదర్శుల పని తీరును ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సాక్షిలో వచ్చిన 'పోస్టింగ్ హుస్నాబాద్‌లో..విధులు అక్కన్నపేటలో 'కథనానికి స్పందిస్తూ.. మండలాలు విభజన జరిగిన సమయంలో అక్కన్నపేటలో సిబ్బంది లేనందున అక్కడికి సూపరింటెండెంట్ పోస్టును ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు వీఆర్వోలను వివిధ శాఖలకు పంపించడం వల్ల అక్కన్నపేట మండల పరిషత్‌లో సిబ్బంది ఉన్నప్పటికీ అనుభవం లేనందున సూపరింటెండెంట్‌ను అక్కడ నుంచి హుస్నాబాద్‌కు తీసుకోలేదన్నారు. కలెక్టర్‌కు నివేదించి సూపరింటెండెంట్‌ను హుస్నాబాద్‌కు తీసుకోనేందుకు చర్యలు తీసుకుంటాం. హుస్నాబాద్ మండల పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య ముదిరిన వివాదానికి కలెక్టర్ రాగానే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. సెలవులో వెళ్లిన ఎంపీడీఓ తిరిగి విధుల్లో చేరడమా...? కొత్త వారికి బాధ్యతలు అప్పగించడమా ఏదో ఒకటి జరుగుతుందన్నారు. వీరి వెంట ఇంచార్జి ఎంపీడీఓ సత్యనారాయణ ఉన్నారు.

నిత్యసాధనతో క్రీడల్లో రాణించాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఐఈఓ

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతోపాటు విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం జీజేసీ చేర్యాల, సిద్దిపేట మైనార్టీ కళాశాల జట్ల మధ్య వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులు నిత్య సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అండర్-19 క్రీడల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మాట్లాడుతూ వాలీబాల్ క్రీడల్లో జిల్లా నుంచి 20 బాలుర, 18 బాలికల జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. కాగా కబడ్డీ పోటీలో వర్గల్ టీఎస్ డబ్ల్యూఆర్‌జేసీ జట్టు ప్రథమ స్థానం, దౌల్తాబాద్ ఎంజేపీజేసీ జట్టు ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మొయినాబాద్ మండలం చిన్న మంగళారంకు చెందిన షేక్ మహ్మద్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలో విక్రయించేందుకు వచ్చినట్లు బీడీఎల్ పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో పౌర సరఫరా అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆటోతోపాటు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పటాన్‌చెరు పౌర సరఫరా డిప్యూటీ తహసీల్దార్ విష్ణు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ షేక్ మహ్మద్, ఓనర్ మహబూబ్‌లపై కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యం

బట్టలు అమ్మడానికని వెళ్లి...



ప్రభాకర్

దుబ్బాక: రోజు మాదిరిగా బట్టలు అమ్మడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన దుబ్బాకలో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చీర్లంచ ప్రభాకర్ (54) ఊరూరా తిరుగుతూ బట్టలు అమ్ముతూ ఉంటాడు. రోజు మాదిరిగా ఆదివారం కూడా వెళ్లాడు. రాత్రి అయినా ప్రభాకర్ ఇంటికి రాకపోవడంతో భార్య రాధ ఫోన్ చేసింది. స్విచ్ ఆఫ్ రావడంతో స్థానికులతో కలిసి వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభాకర్ ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల చొక్కా, గోధుమ రంగు ప్యాంట్ ధరించినట్లు చెప్పారు.

తల్లి, ఇద్దరు పిల్లలు ...



లలిత

పటాన్‌చెరు టౌన్: తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు. భానూర్ పరిధిలోని కంచర్ల గూడెం గ్రామానికి చెందిన నరేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన ఆటో తీసుకొని ఉదయం బయటికి వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య లలిత, పిల్లలు సాయి నిహాల్, రిషికలు కనిపించలేదు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుని మోసం చేశాడని..

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు



ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన రజిని

కల్హేర్(నారాయణఖేడ్): ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి ప్రియురాలు ఆందోళన చేసింది. సోమవారం కల్హేర్ మండల కేంద్రంలో సంఘటన జరిగింది. బాధితురాలు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సత్తేపల్లి మండలం తాళ్లచెరువుకు చెందిన కుంచపు రజిని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్‌కు చెందిన వల్లూరి రమేష్, కుంచపు రజినికి సిద్దిపేటలో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. పరిచయం కాస్త ప్రేమగా మారింది. స్నేహితుల సహకారంతో 2022 ఏప్రిల్ 15న వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఏడాదిన్నర పాటు ఇద్దరు కలిసి ఉన్నారు. ఇటీవల ఇంటికి వచ్చిన రమేష్ ఆమెకు దూరంగా ఉంటున్నాడు. దీంతో రజని హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రమేష్ ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో ఆమె కల్హేర్‌కు వచ్చింది. రమేష్ ఇంటికి తాళం వేసి ఉండటంతో అక్కడే కూర్చుని ఆందోళన చేపట్టింది. న్యాయం చేయాలని కల్హేర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించింది. రమేష్ తండ్రిని పోలీసులు పిలిచి రమేష్‌ను తీసుకురావాలని ఆదేశించారు. మంగళవారం తీసుకొస్తానని చెప్పాడు.

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.శ్వేత అన్నారు. పోలీసుశాఖ, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్థికసాయంతో నిరుద్యోగ మహిళలు, యువతకు కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేటలో పైలెట్ ప్రాజెక్ట్‌గా డ్రైవింగ్‌పై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 35 మంది మహిళలకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం ఆర్టీఓ అధికారితో మాట్లాడి డ్రైవింగ్ లైసెన్స్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే క్యాబ్ కొనుగోలుకు, డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఇండియా బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ రాఘవ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, రాజలింగం, సిబ్బంది నజీమ్, నాగరాజు, ఎస్బీ సీఐ రఘుపతిరెడ్డి, కానిస్టేబుల్ పరందాములు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ సాయం

సిద్దిపేటకమాన్: బాధిత మహిళలకు భరోసా కేంద్రం, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ అండగా ఉంటుందని సీపీ శ్వేత అన్నారు. ఆ కేంద్రాల సిబ్బందితో సోమవారం సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోక్సో, అత్యాచార బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. భరోసా సెంటర్ సేవల కోసం 08457-293098, డయల్ 100.. గృహహింస, వరకట్న వేధింపులకు గురైతే స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ 9494639498కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.